సాక్షి
జనగామ
గురువారం । 24 । జూలై । 2025



బొగత.. జలసవ్వళ్లు

ములుగు జిల్లాలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు వాజేడు మండలం చీకుపల్లి సమీపంలోని సహజసిద్ధ బొగత జలపాతం పరవళ్లు తొక్కుతోంది. కాగా, జలపాతం ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తుండటంతో తాత్కాలికంగా పర్యాటకుల సందర్శనను నిలిపివేసినట్లు ములుగు డీఎఫ్‌ఓ రాహుల్ కిషన్ జాదవ్ తెలిపారు. - వాజేడు

న్యూస్‌రీల్

ప్రతిఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలి

అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్



జనగామ రూరల్: విద్యార్థులకు తప్పనిసరిగా ఆర్‌బీఎస్‌కే ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. బుధవారం మండలం చౌడారం మోడల్ పాఠశాలను అదనపు కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. రాష్ట్రీయ బాల స్వస్తియ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలకు తప్పనిసరిగా వైద్య పరీక్షల నిర్వహించి, నివేదికను అందజేయాలన్నారు. మందుల స్టాక్ రిజిస్టర్‌ను విద్యార్థుల సంఖ్యను కూడా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు వేడి చేసి చల్లార్చిన తాగునీటిని ఇవ్వాలని, తాజాగా వండిన ఆహారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సంపత్ కుమార్, అధ్యాపకులు, వైద్యులు పాల్గొన్నారు.

అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు

జనగామ: ఆరోగ్య, వైద్య కుటుంబ సంక్షేమ శాఖ విభాగం (డీఎంఈ) పరిధిలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న వైద్యులకు పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయా స్పెషాలిటీ విభాగాల్లో పని చేస్తున్న వారికి పదోన్నతి కల్పిస్తూ ప్రొఫెసర్లుగా తక్షణమే విధుల్లో చేరే విధంగా ఆదేశాలు జారీ చేశారు. వైద్య విద్య డైరెక్టర్ ఆదేశాలను అనుసరిస్తూ వైద్య కళాశాల ప్రిన్సిపాల్స్, ఆస్పత్రుల సూపరింటెండెంట్లు పదోన్నతి పొందిన వారిని వెంటనే రిలీవ్ చేయాలని కోరారు. అసోసియేట్ ప్రొఫెసర్లు, పదోన్నతి ఉత్తర్వులు అందిన తేదీ నుంచి 15రోజుల వ్యవధిలోపు ఆ పదవిలో చేరాలని, లేదంటే పదోన్నతి కోల్పోతారని పేర్కొన్నారు. జనగామ వైద్య కాలేజీ పరిధిలో అసోసియేట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న పది మంది పదోన్నతిపై రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు వెళుతున్నారు. బయో కెమిస్ట్రీ విభాగంలో హైదరాబాద్ ఉస్మానియా వైద్య కాలేజీ నుంచి డాక్టర్ బనూజరాణి, డీవీఎల్ విభాగంలో డాక్టర్ ఎస్.సుధీర్ పదోన్నతిపై జనగామ వైద్య కాలేజీకి రానున్నారు.

గొర్రెలతో నిరసన



స్టేషన్‌ఘన్‌పూర్: గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం గొర్రెలతో నిరసన చేపట్టారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు అందించారు. ఈ సందర్భంగా జీఎంపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మేకల మల్లేశం మాట్లాడారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి గొర్రెలు, మేకల పెంపకందార్ల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అమరాజు రాజయ్య, గుంటి రాజయ్య, కుమార్, ఐలయ్య, అశోక్, చంద్రయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నెట్‌బాల్‌లో బంగారు పతకాలు




విద్యార్థినులను అభినందిస్తున్న కలెక్టర్

జనగామ: తమిళనాడు రాష్ట్రం సేలంలో ఈ నెల 17 నుంచి 20 వరకు జరిగిన సౌత్ జోన్ నేషనల్ నెట్ బాల్ పోటీల్లో పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించి అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు వైష్ణవి, అక్షయ, మంగ సునైనా, శ్రుత కీర్తి, అర్చనలను కలెక్టర్ రిజ్వాన్ బాషా బుధవారం అభినందించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో యువజన, క్రీడల అధికారి వెంకట్‌రెడ్డి, జిల్లా నెట్‌బాల్ అధ్యక్షుడు రామస్వామి, వెంకటేశ్వర్లు, కోచ్ రవి కుమార్ ఉన్నారు.

బోధనలో మరింత నాణ్యత

రేపటి నుంచి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

- వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు నిర్వహణ
- వందశాతం ఉపాధ్యాయులు హాజరు కావాలి
- ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్న చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు



జిల్లాలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల తేదీలు

నెల	1 నుంచి 5వ తరగతి వరకు (ప్రైమరీ కాంప్లెక్స్/తేదీ)		6 నుంచి 9వ తరగతి వరకు (సబ్జెక్టు కాంప్లెక్స్/తేదీ)	
	మొదటి/రెండవ		మొదటి/రెండవ	
జూలై	25	26	30	31
ఆగస్టు	22	23	29	30
సెప్టెంబర్	16	17	18	19
నవంబర్	21	22	24	25
డిసెంబర్	18	19	20	23
జనవరి-2026	23	24	30	31
ఫిబ్రవరి	20	21	24	24

జనగామ: సర్కారు బడుల్లో బోధనపై ప్రభుత్వం ప్రత్యేక ఫోకస్ సారించింది. పాఠశాల స్థాయిలో పటిష్టమైన పునాదులు వేయడానికి, బోధనలో కొత్త పద్ధతులను అవలంభిస్తున్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో అకడమిక్ క్యాలెండర్ ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలను విడుదల చేసింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల పరిధిలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2024-25 ఎఫ్‌ఎల్‌ఎన్ అసెస్‌మెంట్‌లో నిర్మాణాత్మక సమావేశాలతో విద్యార్థుల అభ్యాసనంలో పురోగతి సాధించారు. రేపటి నుంచి (శుక్రవారం) స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో 'సాక్షి' ప్రత్యేక కథనం.

వందశాతం హాజరు కావాలి

జిల్లాలో ప్రాథమిక 341, ప్రాథమికోన్నత 64, ఉన్నత 130 పాఠశాలలు ఉన్నాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు ఎనిమిది నెలల పాటు ప్రధానోపాధ్యాయులు (సీహెచ్‌ఎం), మండల విద్యాధికారుల (ఎంఈఓ) పర్యవేక్షణలో నిర్వహించే స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు ఉపాధ్యాయులు వందశాతం హాజరు కావాలి. ప్రతీ కాంప్లెక్స్ సమావేశం ముగిసిన వెంటనే తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ మొబైల్ యాప్‌లో కాంప్లెక్స్ హెచ్‌ఎం ఆధ్వర్యంలో మీటింగ్ మినట్స్‌ను అప్‌లోడ్ చేయాలి. ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్న చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలనే ఆదేశాలు జారీ చేశారు. కాంప్లెక్స్ సమావేశాలకు హాజరైన టీచర్లకు మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్ సర్టిఫికెట్ జనరేట్ చేయబడుతుంది. పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన మార్గదర్శకాలను ఎంఈఓలు, కాంప్లెక్స్ హెచ్‌ఎం, రెగ్యులర్ ప్రధానోపాధ్యాయులకు వీటిని చేరవేయాల్సి ఉంటుంది.

40 మందికి మించకూడదు

కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించే సమయంలో ప్రతి గదిలో 40 కంటే ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉండకుండా చూసుకోవాలి. పాఠశాల పరిధిలో ఐఎఫ్‌పీ ప్యానెళ్లు, సబ్జెక్ట్ పాఠ్యపుస్తకాలు, టీఎల్‌ఎం ఉపాధ్యాయ హ్యాండ్ బుక్కులు, వర్క్ బుక్స్, తాగునీరు, మరుగుదొడ్లు ఉన్నాయా లేదా నిర్ధారించుకోవాలి. సమావేశాలను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా, కాంప్లెక్స్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ల సేవలను ఉపయోగించు కోవాలని జీఓలో పేర్కొన్నారు. ఉపాధ్యాయులు కాంప్లెక్స్ సమావేశాలకు హాజరయ్యే క్రమంలో పిల్లల పురోగతి, ఉత్తమ పద్ధతులు, వాటికి సంబంధించిన పూర్తి డేటాతో హాజరు కావాలి.

నిరంతర వృత్తిపరమైన అభివృద్ధి

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిరంతర వృత్తిపరమైన అభివృద్ధికి ఒక వేదికగా పని చేస్తాయి. బోధనలో నాణ్యత పెరగడంతో పాటు విద్యార్థుల అభ్యాసన ఫలితాలను బలోపేతం చేసేందుకు అవకాశం కలుగుతుంది. ఉపాధ్యాయుల అనుభవాలను పంచుకోవడం, ఉత్తమ పద్ధతుల మార్పిడి, భాగస్వామ్య అభ్యాసన సంస్కృతిని పెంపొందిస్తుంది. 1 నుంచి 5 తరగతులను నిర్వహించే అన్ని సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు (ఎస్జీటీలు) పాఠశాల సముదాయ సమావేశాలకు హాజరు కావాల్సి ఉంటుంది. ప్రాథమిక పాఠశాలల బోధనకు అంతరాయం కలగకుండా మొదటి రోజు 50శాతం, రెండవ రోజు మిగతా ఎస్జీటీలు హాజరు కావాలి. 6 నుంచి 9 తరగతులను నిర్వహిస్తున్న అన్ని పాఠశాలల సహాయకులు (స్కూల్ అసిస్టెంట్లు), భాషా పండితులు (ఎల్‌పీ) సంబంధిత సబ్జెక్టు పాఠశాల సముదాయ ప్రాంగణాల్లో నిర్వహించే కాంప్లెక్స్ సమావేశాలకు హాజరు కావాల్సి ఉంటుంది. మొదటి రోజు భాషా, రెండవ రోజు భాషేతర టీచర్లు రావాలి. ప్రతీ నెల రెండు కాంప్లెక్స్ సమావేశాలకు ఎంఈఓలు రెండు సార్లు తనిఖీ చేయాలి. సమావేశాల్లో ఉపాధ్యాయుల సూచనలను డాక్యుమెంట్ రూపంలో తయారు చేసి, ఎస్‌సీఈఆర్టీ సమగ్ర శిక్ష శాఖలకు పంపించాలి. ప్రతి నెల 28వ తేదీన నిర్వహించే జిల్లా సమీక్ష సమావేశంలో కాంప్లెక్స్‌లో తమ దృష్టికి వచ్చిన అందరి అభిప్రాయాలను సీహెచ్‌ఎం, ఎంఈఓల ద్వారా డీఈఓ సేకరించాలి.



రైల్వేస్టేషన్ ఏరియాలోని ప్రభుత్వ పాఠశాల

ఏర్పాట్లు పూర్తి చేశాం..



ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి రేపటి నుంచి జిల్లాలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహించనున్నాం. 1 నుంచి 5, 6 నుంచి 10 తరగతులకు సంబంధించి ప్రైమరీ, సబ్జెక్టు కాంప్లెక్స్ సమావేశాలకు వందశాతం హాజరయ్యేలా చర్యలు తీసుకుంటాం. ఈ ఏడాది జూలై, ఆగస్టు, సెప్టెంబర్, నవంబర్, డిసెంబర్, వచ్చే సంవత్సరం జనవరి, ఫిబ్రవరి మాసం 25వ తేదీ వరకు సమావేశాలు జరుగుతాయి.

- భోజన్న, జిల్లా విద్యాశాఖ అధికారి

లబ్ధిదారులను ఇబ్బంది పెడితే చర్యలు

- కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవని, సంక్షేమ పథకాల అమలులో జిల్లా పురోగతి సాధించేలా అధికారులు క్షేత్రస్థాయిలో పని తీరు మెరుగుపడాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్లు, పాఠశాల, హాస్టళ్ల సందర్శనపై నివేదిక భూభారతి దరఖాస్తులు, వన మహోత్సవం, వర్షాలు తదితర అంశాలపై అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్‌లతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంజూరైన ప్రతీ లబ్ధిదారుడు ఇంటి నిర్మాణం ప్రారంభమయ్యేలా అధికారులు క్షేత్రస్థాయిలో మానిటరింగ్ చేయాలని, దశల వారీగా పూర్తవుతున్న ఇళ్లకు సంబంధించిన గడువులోగా డబ్బులు జమ అయ్యేలా చూడాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్, హాస్టళ్లను విద్యా సంవత్సరం ముగిసే వరకు తనిఖీలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వన మహోత్సవంలో నాటిన ప్రతిమొక్కను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ 2025 సిటిజన్ ఫీడ్ బ్యాక్ లక్ష్యాన్ని గ్రామం వారీగా పూర్తి కావాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ మాధురి షా, ఆర్డీఓలు, డీఆర్‌డీఏ పీడీ, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల ఫిర్యాదులకు ప్రత్యేక సెల్

జనగామ రూరల్: ఎరువులకు సంబంధించిన ఫిర్యాదులను తెలియజేసేందుకు జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల సెల్‌ను బుధవారం కలెక్టర్ రిజ్వాన్ బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు ఎరువులను అమ్మితే చర్యలు తప్పవన్నారు. ఏమైనా ఫిర్యాదు ఉంటే 8977745512 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంబికాసోని, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ ఎకరాకు సాగునీరు అందిస్తాం

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- పలు రిజర్వాయర్ల నుంచి నీరు విడుదల



ఘన్‌పూర్ రిజర్వాయర్ వద్ద గోదావరి జలాలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, యశస్వినిరెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్/రఘునాథపల్లి: దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా నియోజకవర్గంలోని ప్రతీ ఎకరాకు సాగునీరు అందించి రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బుధవారం స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి కుడి ప్రధాన కాల్వ ద్వారా పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డితో కలిసి సాగు నీటిని విడుదల చేశారు. రఘునాథపల్లి మండలంలోని అశ్వారావుపల్లి రిజర్వాయర్ కుడి కాలువ, చీటకొడూర్ ఎడమ కాలువ ద్వారా నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు చేసి పసుపు, కుంకుమ, పూలు చల్లారు. అనంతరం కడియం మాట్లాడుతూ ఘన్‌పూర్ రిజర్వాయర్ కుడి మెయిన్ కెనాల్ కింద స్టేషన్‌ఘన్‌పూర్, వర్ధన్నపేట, పాలకుర్తి నియోజకవర్గాలకు సాగునీరు అందుతుందన్నారు. రైతుల ఇబ్బందులను గుర్తించి రిజర్వాయర్‌ల ద్వారా ఆన్ ఆఫ్ పద్ధతిలో నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. రైతులు నీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా కొందరు బీఆర్‌ఎస్ నాయకులు సాగునీటి విషయంలో ఇష్టారాజ్యంగా మాట్లాడుతూ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్య, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, ఆర్డీఓ డీఎస్ వెంకన్న, నాయకులు బెలిదె వెంకన్న, నరేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నీటిపారుదల ఎస్ఈ సుధీర్, ఈఈ వినయ్‌బాబు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మాజీ జెడ్పీటీసీలు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, బొల్లం అజయ్, గుడి వంశీధర్‌రెడ్డి, కోళ్ల రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు బీమా

ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద అమలు

- బీమా లేని వారిని గుర్తించే పనిలో అధికారులు
- జిల్లాలో 2.31 లక్షల ఉపాధి కూలీలు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)



జనగామ రూరల్: గ్రామాల్లో వలసలు నివారించి పని కోరిన ప్రతిఒక్కరికీ స్థానికంగా ఉపాధి కల్పించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టింది. ప్రస్తుతం ఈ పథకం ద్వారా కూలీలు తమ అవసరాలకు ఉపాధి పొందుతుండగా వారికి మరో ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు కలిగిన ప్రతిఒక్కరికీ ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు చేపడుతోంది. కూలీలతో కొంత ప్రీమియం చెల్లింపజేసి వారికి బీమాను కల్పించేలా ప్రోత్సహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఇందుకోసం ఇప్పటికే ఉపాధి హామీలో ఉన్న కూలీలకు ఎవరెవరికీ బీమా ఉంది, లేనివారితో బీమా చేయించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో అధికారులు జిల్లాలో బీమా లేని వారి వివరాలను సేకరించి వారిని బీమా చేయించే దిశగా అడుగులు వేస్తున్నారు.

ఏటా రూ.20 బీమాకు జమ

జిల్లాలో మొత్తం 1.21 లక్షల యాక్టివ్ జాబ్‌కార్డులు ఉండగా.. ఇందులో 2.31 లక్షల మంది కూలీలు పనిచేస్తున్నారు. వీరందరికీ బీమా వర్తించనుంది. సురక్ష బీమా యోజన కోసం 18 నుంచి 71 ఏళ్లలోపు వారు జాతీయ బ్యాంకుల్లో పేరు నమోదు చేసుకోవాలి. ఈ ఖాతా ఆధార్ కార్డుతో అనుసంధానమై ఉండాలి. బ్యాంకు ఖాతా ఉన్న బ్రాంచీలో ఖాతా నుంచి ఏటా రూ.20 బీమాకు జమ చేయాలని అంగీకారపత్రం ఇవ్వాలి. పేరు నమోదు చేసుకున్న వారు ప్రమాదవశాత్తు మరణించినా పూర్తిగా అంగవైకల్యం కలిగినా.. రూ.2 లక్షల పరిహారం పొందే అవకాశం ఉంటుంది. పాక్షికంగా అంగవైకల్యం కలిగినా.. రూ.లక్ష పరిహారం అందుతుంది. కాగా ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన 50 రోజుల్లో రూ.20 కోట్ల మేరకు పనులు చేపట్టారు.

ఉపాధి కూలీలందరికీ వర్తించేలా..



ఉపాధి కూలీలకు బీమా అనేది నిరంతరం ప్రక్రియ. దీనికి చివరి తేదీ అంటూ ఏమీ లేదు. జిల్లాలో ఎవరెవరికీ బీమా లేదన్న విషయాన్ని బ్యాంకుల వద్ద సేకరించి లేని వారికి బీమా కల్పించేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. ప్రతి ఒక్కరికీ బీమా కల్పించడమే లక్ష్యంగా అవగాహన కల్పిస్తున్నాం.

- వసంత, డీఆర్‌డీఓ

ఆర్టీసీపై నమ్మకాన్ని పెంచిన ప్రభుత్వం

- కలెక్టర్ రిజ్వాన్ బాషా
- బస్టాండ్‌లో మహాలక్ష్మి పథకం సంబురాలు



జనగామ రూరల్: బహుమతి అందిస్తున్న కలెక్టర్



రఘునాథపల్లి: ఎరువుల నిల్వ బోర్డును పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: ప్రభుత్వం మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి ఆర్టీసీని బలోపేతం చేయడమే కాక ప్రజల్లో నమ్మకాన్ని పెంచిందని కలెక్టర్ రిజ్వాన్ బాషా తెలిపారు. బుధవారం జనగామ ఆర్టీసీ బస్టాండ్‌లో మహాలక్ష్మి పథకం విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిపోలో 2.26 కోట్ల మహిళలు ప్రయాణించి రూ.108.96 కోట్లు ఆర్టీసీ ప్రగతి సాధించినట్లు తెలిపారు. బస్సుల ద్వారా ఆదాయం సమకూరడంతో మహిళా సంఘాలు బస్సులను కొనుగోలు చేసి తద్వారా లబ్ధి పొందడమే కాక ఆ బస్సులకు యజమానులుగా మారారన్నారు. అనంతరం ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్ మాట్లాడుతూ. ఆర్టీసీ సంస్థ లాభాల బాటల పయనించడం సంతోషకరంగా ఉందన్నారు. డీఎం స్వాతి ఆర్టీసీ ప్రగతిని వివరిస్తూ గతంలో 36 వేల మంది ప్రయాణించే ఈ ప్రాంతం 56 వేల మంది ప్రయాణికులతో 66శాతం మహిళలతోనే ప్రయాణాలు కొనసాగుతున్నట్లు వివరించారు. ఆర్టీసీ సంస్థ ప్రగతి బాటలో పరుగులు పెడుతున్నదని అందుకు ఆర్టీసీ ఉద్యోగులు అందిస్తున్న సహకారం మరువలేనిది అన్నారు. కాగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన వారికి కలెక్టర్ సన్మానించి ప్రత్యేక బహుమతులను అందించారు.ఈ కార్యక్రమంలో అడీషనల్ డీఆర్‌డీవో నూరుద్దీన్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు మమత ఆర్టీసీ అధికారులు సిబ్బంది మహిళ ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

రఘునాథపల్లి: జిల్లాలో సరిపడు యూరియా నిల్వలు ఉన్నాయని, కొరత సృష్టిస్తే వ్యాపారులపై కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని వెంకటేశ్వర, లక్ష్మి ఫర్టిలైజర్ షాపులు, ఉన్నత పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూరియా వ్యవసాయేతర అవసరాలకు తరలిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే ఉన్నత పాఠశాలలో కిచెన్‌షెడ్‌ను పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని, సరుకుల వద్ద పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ నిర్వాహకులకు సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ భోజన్న, ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు, ఎంఈఓ రఘునందన్ రెడ్డి, డీఏఓ అంబికాసోని పాల్గొన్నారు.

మత్తడి పోస్తున్న కృష్ణాజీగూడెం చెరువు



చెరువులకు జలకళ

చిల్పూరు: గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని పలు చెరువులు, కుంటలు మత్తడి పోస్తున్నాయి. మల్లన్నగండి నుంచి వస్తున్న నీటితో పాటు బుధవారం కురిసిన వర్షానికి చిల్పూరు మండలం కృష్ణాజీగూడెం చెరువు మత్తడి పోసింది. దీంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

అర్చకుల సమస్యలు పరిష్కరించాలి

లింగాలఘణపురం: దూపదీప నైవేద్య పథకంలో అర్చకులుగా పనిచేస్తున్న వారి సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గట్టు శ్రీనివాసాచార్యులు కోరారు. బుధవారం మండలంలోని జీడికల్‌లో జనగామ, యాదాద్రి, వరంగల్, నల్లగొండ జిల్లాల దూపదీప నైవేద్య పథక అర్చకుల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు దేవాలయాల్లో డీడీఎన్ (దూపదీప నైవేద్య) పథకంలో పని చేస్తున్న అర్చకులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలపై దేవాదాయశాఖ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో అర్చకులు ప్రమోద్‌కుమార్, సునీల్‌కుమార్, గిరిప్రసాద్‌శర్మ, శంకరయ్యశర్మ, ప్రవీణ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ఉమ్మడి జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని డీఎస్ఏ బాక్సింగ్ హాల్‌లో గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సబ్‌జూనియర్స్ బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు హనుమకొండ, వరంగల్ బాక్సింగ్ అసోసియేషన్ నిర్వహణ కార్యదర్శి పి. రాజేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు జనవరి 01, 2011 నుంచి డిసెంబర్ 31, 2012 తేదీలోపు జన్మించి ఉండాలన్నారు. క్రీడాకారులు తమ ఆధార్, పాఠశాల స్టడీ సర్టిఫికెట్, మున్సిపల్ ధ్రువీకరించిన జనన ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఉదయం 7.30 గంటలకు బాక్సింగ్‌హాల్ వద్ద రిపోర్టు చేయాలని సూచించారు. ఇందులో గెలుపొందిన క్రీడాకారులు ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు హైదరాబాద్ లోని షేక్‌పేట్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఇతర వివరాలకు 99597 11609 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా దానయ్య



హన్మకొండ: తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బక్క దానయ్య ఎన్నికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య భవన్‌లో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో హనుమకొండ జిల్లా హనుమకొండ రూరల్ సబ్ డివిజన్ ఏడీఈ బక్క దానయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ తనను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు, సహకరించిన అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెపల్లి మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై బుధవారం హనుమకొండకు చేరుకున్న బక్క దానయ్యకు ఆ అసోసియేషన్ నాయకులు రౌతు రమేశ్ కుమార్, స్వదేశ్, చలపతి, కు మారస్వామి, కృష్ణ, కుమారస్వామి, రాజయ్య, జడల రవి, తదితరులు స్వాగతం పలికారు.

పట్టుదలతో చదివి..

- జూనియర్ సివిల్ జడ్జి పోస్టుకు ఎంపికైన అశ్విని
- కుటుంబీకులు, మండల వాసుల హర్షం



అశ్విని

రఘునాథపల్లి: చట్టంపై అవగాహన లేకపోవడంతో సామాన్యుల ఇబ్బందులను చూసిన ఆమెకు న్యాయవిద్య అభ్యసించాలనే ఆలోచన కలిగింది. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పట్టుదలతో చదివి లక్ష్యం సాధించారు. ఇటీవల వెలువడిన ఫలితాల్లో జూనియర్ సివిల్ జడ్జి పోస్టుకు ఎంపికయ్యారు. ఆమె రఘునాథపల్లి గ్రామానికి చెందిన నోముల యాకయ్య, పార్వతి దంపతుల కూతురు అశ్విని. హైదరాబాద్ గండిపేటలోని ఎన్టీఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన అశ్విని.. బషీర్‌బాగ్ పీజీ కాలేజీలో ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్ఎల్ఎం పూర్తి చేశారు. ఈ క్రమంలో గత సంవత్సరం జూనియర్ సివిల్ జడ్జి పరీక్ష రాసిన ఆమె.. ఇటీవల వెలుడిన ఫలితాల్లో రాష్ట్రంలో 23 ర్యాంకు సాధించి లక్ష్యం సాధించారు. కాగా, అశ్విని ఆగస్టులో జూనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు స్వీకరించే అవకాశముందని కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా, అశ్వినిని బుధవారం టీడీపీ నాయకులు బొక్క రామచంద్రయ్య, ఎడ్ల మల్లేశం, జహంగీర్, నర్సయ్య, నర్సింగరావు, శ్రీనివాస్, యాదగిరి, మధుసూదన్, శ్రీహరి, వంశీ, బుచ్చిరెడ్డి ఘనంగా సన్మానించారు.

శ్రావణం..శుభకరం

రేపటి నుంచి శ్రావణ మాసం ప్రారంభం



గర్భగుడిలో లక్షపత్రిపూజ చేస్తున్న భక్తులు(ఫైల్)

- ఆగస్టు 23వ తేదీ వరకు ప్రత్యేక పూజలు
- కాళేశ్వరం గర్భగుడిలో ప్రత్యేకంగా లక్షపత్రి పూజలు, అభిషేకాలు
- తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి రానున్న భక్తులు

కాళేశ్వరం: శ్రావణం..సకలం శుభకరం. చేపట్టిన ప్రతీ కార్యం సిద్ధిస్తుందని భక్తుల విశ్వాసం. మహాశివుడికి ప్రీతికరణమైన శ్రావణ మాసం శుక్రవారం నుంచి ప్రారంభమై ఆగస్టు 23వ తేదీన ముగుస్తుంది. ఈ సందర్భంగా భక్తజనం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి వారి ఆలయంలో శివనామ స్మరణ మార్మోగనుంది. కాళేశ్వరాలయానికి తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి నెలరోజుల పాటు నిత్యం వేల సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు.

లక్షపత్రి పూజ ప్రత్యేకం..



శ్రావణమాసంలో కాళేశ్వరాలయంలో లక్షపత్రి పూజకు ప్రత్యేకత ఉంది. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు ప్రతీ రోజు సాయంత్రం వేళల్లో బిల్వ దళాలతో 'లక్షపత్రి పూజ' చేసి మహాశివుడిని పూజిస్తారు. స్వయంగా గర్భగుడిలో ద్విలింగాల స్పర్శ దర్శనం ఉండడంతో భక్తులు ఆసక్తి చూపుతారు. జంటకు(దంపతులు) టికెట్ ధర రూ.8 వేలుగా నిర్ణయించారు. ఒక రోజు ఐదుగురికి మాత్రమే ఈ పూజ నిర్వహిస్తారు. ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్ జరుగుతుండగా, బుకింగ్ కౌంటర్ ఏర్పాటు చేశారు. ఇదివరకు లక్షపత్రి పూజ టికెట్‌కు రూ.6వేలు ధర ఉండగా, ప్రస్తుతం పెరిగిన నేపథ్యంలో భక్తులకు భారం కానుంది. శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామివార్లకు భక్తులు అత్యధికంగా రూ.వెయ్యి టికెట్ చెల్లించి అభిషేక పూజలు నిర్వహిస్తారు. కాళేశ్వరం దేవస్థాన అనుబంధ దేవాలయాలైన శ్రీశుభానందాదేవి(పార్వతి), శ్రీసరస్వతీ అమ్మవార్ల ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు చేస్తారు. పార్వతి అమ్మవారి ఆలయంలో కుంకుమార్చనలు అత్యధికంగా నిర్వహిస్తారు. ఉసిరిచెట్టు వద్ద లక్షవత్తులు వెలిగిస్తారు. సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేస్తారు. ఉపవాసదీక్షలు చేస్తారు. మహిళలు వరలక్ష్మీవ్రతం నిర్వహిస్తారు. నెలపాటు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుంది.

దేవతారాధన చేయాలి..



శ్రావణమాసం నెలరోజుల పాటు దేవతామూర్తులకు పూజలు నిర్వహిస్తే మంచిది. దేవతారాధన చేయొచ్చు. శ్రావణమాసం శుభకార్యాలకు అనుకూలం. లక్షపత్రి పూజలు నిర్వహిస్తే మహాశివుడి కరుణతోపాటు ముక్తి లభిస్తుంది. భక్తులు ఎక్కువ లక్షపత్రి పూజలపై ఆసక్తి చూపుతారు. కాళేశ్వరంలో ద్విలింగాలకు లక్షపత్రి పూజచేస్తే స్వామివారి మోక్షం లభిస్తుంది.

– పనకంటి ఫణీంద్రశర్మ, ఉపప్రధాన అర్చకుడు, కాళేశ్వరం దేవస్థానం

కల్యాణ వైభోగమే..

- 25 నుంచి పెళ్లి సందడి మరూ..
- తలంబ్రాలకు వేళాయె



కాజీపేట: మరో రెండు రోజుల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పెళ్లి బాజాలు మోగనున్నాయి. ఈనెల 25న శ్రావణ మాసం మొదలు.. నవంబర్ చివరి వరకు పెళ్లి సందడి నెలకొననుంది. దీంతో బంగారు ఆభరణాలు, దుస్తుల దుకాణాలు కొనుగోలుదారులతో సందడిగా మారనున్నాయి. కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో ఉన్న ఫంక్షన్ హాళ్లు అడ్వాన్స్ బుక్ అయ్యాయి. దాదాపు 6 వేల వరకు పెళ్లిళ్లు జరిగే అవకాశం ఉందని పురోహితుల అంచనా. కాగా జీవితంలో ఒకేసారి జరిగే వేడుక అనే కారణంగా సామాన్య, మధ్య తరగతి ప్రజలు కూడా వివాహాలకు భారీగా ఖర్చు చేస్తున్నారు. సగటున ఒక్కో పెళ్లికి రూ.10లక్షలకు తగ్గకుండా ఖర్చు చేస్తున్నారు.

పెళ్లి ముహూర్తాలు..



- జూలై నెలలో 26, 30, 31
- ఆగస్టులో 1,3,5,7,8,9,10,11,12,13,14,17
- సెప్టెంబర్‌లో 24, 26, 27, 28
- అక్టోబర్‌లో 1,2,3,4,8,10,11,12,22,24,29,30,31
- నవంబర్‌లో 1,2,7,8,12.13,15,22,23,26,27,29,30వ

తేదీల్లో పెళ్లిళ్లు జరగనున్నాయి. కాగా, భాద్రపద మాసం ఆగస్టు 21 నుంచి సెప్టెంబర్ 21వ తేదీ వరకు పెళ్లిళ్లకు ముహూర్తాలు లేవని కాజీపేట అభయాంజనేయ స్వామి దేవాలయ ప్రధాన అర్చకుడు జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ 'సాక్షి'కి తెలిపారు.

25 నుంచి రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ బ్యాడ్మింటన్ పోటీలు

- నేడు క్వాలిఫైయింగ్ రౌండ్స్
- 20 జిల్లాల నుంచి 190 మంది క్రీడాకారులు..



టోర్నమెంట్ వివరాలు వెల్లడిస్తున్న జితేందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండ జిల్లా వేదికగా మూడు రోజులు జరగనున్న 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్స్ (అండర్–17) బాలబాలికల షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మూల జితేందర్‌రెడ్డి, డాక్టర్ కొమ్ము రాజేందర్ తెలిపారు. ఈమేరకు బుధవారం హనుమకొండలోని వరంగల్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చాంపియన్‌షిప్ వివరాలు వెల్లడించారు. ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు వరంగల్ క్లబ్, భీమారంలోని కిట్స్ కళాశాల ఇండోర్ స్టేడియంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు రోజులు జరగనున్న పోటీలకు ముందు నేడు(గురువారం) క్రీడాకారులకు క్వాలిఫైయింగ్ రౌండ్స్ నిర్వహించి ప్రతిభ ఆధారంగా మెయిన్ జట్లలోకి తీసుకుంటామన్నారు. సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ కేటగిరీల్లో జరిగే పోటీలకు తెలంగాణలోని 20 జిల్లాల నుంచి 190 మంది క్రీడాకారులు హాజరవుతున్నారన్నారు. వరంగల్ క్లబ్‌లో 25న జరిగే పోటీలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. 27వ తేదీన నిర్వహించే ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి , గౌరవ అతిథులుగా ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, మాస్టర్స్ ఇంటర్నేషనల్ క్రీడాకారుడు శశిధర్ హాజరై విజేతలకు బహుమతులు అందజేస్తారన్నారు. సమావేశంలో వరంగల్ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పింగిళి రమేశ్ రెడ్డి, కోశాధికారి నాగకిషన్, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ.. యువకుడి దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు
- శివునిపల్లిలో ఘటన



రాము (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: రెండు బైక్‌లు ఢీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం రాత్రి స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. శివునిపల్లికి చెందిన కొడిశాల రాము (27)నాలుగు నెలల క్రితం తన తండ్రి నర్సయ్య స్థానంలో పారిశుద్ధ్య కార్మికుడిగా చేరి పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌పై గ్రామంలోని వివేకానంద చౌరస్తా నుంచి ఎస్సీ కాలనీ వైపు వస్తున్నాడు. అదే సమయంలో ఇదే గ్రామానికి చెందిన అలుగు వికాస్ బైక్‌పై అంబేడ్కర్ సెంటర్ నుంచి వివేకానంద చౌరస్తా వైపునకు వస్తున్నాడు. ఈ క్రమంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు ఎగిరి రోడ్డుపై పడగా తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు రాము వెంటనే ఘన్‌పూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం 108లో వరంగల్ ఎంజీఎం తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మరో క్షతగాత్రుడు వికాస్ హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై మృతుడి భార్య శ్వేత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు.

బావను హత్య చేసిన బావమరిది..

- భూ వివాదమే కారణం



ఉప్పలయ్య(ఫైల్)

కేసముద్రం: భూ వివాదంలో బావను బావమరిది హత్య చేశాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఉప్పరపల్లిలో చోటుచేసుకుంది. రూరల్ సీఐ సర్వయ్య కథనం ప్రకారం..గ్రామానికి చెందిన కంకల ఉప్పలయ్య(50), అతడి బావమరిది కొనగొండ మల్లేశ్ మధ్య కొంత కాలంగా భూవివాదం జరుగుతోంది. ఈ క్రమంలో బుధవారం గ్రామశివారులో ఒంటరిగా జీవాలు మేపుతున్న ఉప్పలయ్యపై మల్లేశ్ ఇనుపరాడ్డుతో మోది హత్య చేశాడు. దీనిపై సమాచారం అందుకున్న డీఎస్పీ తిరుపతిరావు, రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై కరుణాకర్ ఘటనాస్థలికి చేరుకున్నారు. మృతదేహన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మానుకోట జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య కోమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు రూరల్ సీఐ తెలిపారు. కాగా, నిందితుడు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

చేపల వేటకు వెళ్లి యువకుడి గల్లంతు

- కొత్తగూడలో ఘటన



గల్లంతైన నరేశ్

కొత్తగూడ: చేపల వేటకు వెళ్లిన ఓ యువకుడు వాగులో గల్లంతయ్యాడు. ఈ ఘటన బుధవారం మండల కేంద్రం సమీపంలోని రాల్ల ఒర్రె వాగులో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన ఆగబోయిన నరేశ్ వాగులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపలు పడుతున్న క్రమంలో వాగు ఉధృతి పెరిగి తాను నిల్చున్న మట్టి కొట్టుకుపోయింది. దీంతో నరేశ్ వాగులో కొట్టుకుపోతుండగా సమీపంలో ఉన్న వారు గమనించి మాజీ సర్పంచ్ రణధీర్‌కు సమాచారం అందించారు. రణధీర్.. అధికారులకు సమాచారం ఇచ్చాడు. దీంతో మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు, సీఐ సూర్య ప్రకాశ్, ఎస్సై రవికుమార్, తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ రోజారాణి, పంచాయతీ కార్యదర్శి సుమన్‌రెడ్డి హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. వాగులో ఈతగాళ్లు ఎంత గాలించినా నరేశ్ ఆచూకీ లభించలేదు. సాయంత్రం వరకు గాలింపు చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. కాగా, చేపల వేటకు వెళ్లి తమ ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని డీఎస్పీ ప్రజలకు సూచించారు.

అత్త మందలించిందని కోడలు ఆత్మహత్యాయత్నం..

- చికిత్స పొందుతూ మృతి
- ఈదులపూసపల్లిలో ఘటన




మాధవి(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : అత్త మందలించిందనే కారణంతో మనస్తాపానికి గురైన కోడలు ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందింది. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి ఈదులపూసపల్లి గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకోగా రూరల్ ఎస్సై వి. దీపిక బుధవారం కేసు వివరాలు వెల్లడించారు. గ్రామానికి చెందిన ఆకుల మాధవి (40) యుగంధర్ దంపతులకు 30 గుంటల వ్యవసాయ భూమి ఉంది. ఈనెల 20వ తేదీన ఆ కుటుంబీకులు వరి నాటు వేసేందుకు వెళ్లారు. అక్కడ అత్త ధనమ్మ నాటు మంచిగా వేయించమని కోడలు మాధవిని మందలించి ఇంటికెళ్లింది. పని పూర్తయిన అనంతరం సాయంత్రం ఇంటికెళ్లిన మాధవి.. అత్త మందలించిందనే మనస్తాపంతో అదేరోజు రాత్రి గడ్డి మందుతాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన భర్త, అత్త వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. మృతురాలు మాధవి తల్లి ముత్యాల ప్రమీల ఫిర్యాదు మేరకు రూరల్ ఏఎస్సై వెంకన్న, కానిస్టేబుల్ సంతోశ్.. శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలికి ముగ్గురు కుమార్తెలు రమ్యశ్రీ, నవ్యశ్రీ, ఉదయశ్రీ ఉన్నారు.

తమ్ముడికి బైక్ ఇవ్వడానికి వెళ్తూ మృత్యుఒడికి..

- పిడుగుపాటుతో యువకుడి మృతి



వేణు మృతదేహం

వాజేడు: తమ్ముడికి బైక్ ఇవ్వడానికి వెళ్తూ ఓ యువకుడు మృత్యుఒడికి చేరాడు. పిడుగుపాటుతో మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం మండలంలోని పెద్దగొళ్ల గూడెం వద్ద చోటుచేసుకుంది. వాజేడు ఎస్సై సతీశ్ కథనం ప్రకారం.. మండలంలోని పేరూరుకు చెందిన తోటపల్లి వేణు (20) భద్రాచలంలో ఉంటున్న తన తమ్ముడు ఏటూరునాగారం వరకు వస్తున్నట్లు చెప్పగా, అతడికి బైక్ ఇవ్వడానికి వర్షంలో ఇంటి నుంచి బయలుదేరాడు. ఈ క్రమంలో పెద్దగొళ్ల గూడెం వద్దకు రాగానే వేణు సమీపంలో పిడుగు పడింది. అటు వైపు వస్తున్న వారు చూసి బంధువులకు సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన వాజేడు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి వేణు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని ఏటూరునాగారం సివిల్ ఆస్పత్రికి తరలించి శవపంచనామా నిర్వహించారు.

జల సవ్వడి..



భీమునిపాదం జలపాతం వద్ద పర్యాటకుల కేరింతలు

జాలువారుతున్న జలపాతాలు

- కనువిందు చేస్తున్న భీమునిపాదం, పాండవులు, వంకమడుగు వాటర్ ఫాల్స్
- పర్యాటకుల సందడి..

గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచ సమీప అడవిలోని భీమునిపాద జలపాతం బుధవారం జాలువారుతూ చూపరులను కనువిందు చేసింది. కొన్ని రోజుల నుంచి మోస్తరు వర్షం కురుస్తుండగా, ఆదివారం నుంచి ఆ జలపాతం జాలువారడం ప్రారంభమైంది. రెండు రోజులుగా రాత్రి సమయాల్లో భారీ వర్షం కురువడంతో జలపాతం భారీగా జాలువారుతూ సమీపంలోని భీమునిపాదం చెరువులోకి ప్రవహించింది. దీంతో పర్యాటకులు వివిధ వాహనాల ద్వారా చేరుకుని జలపాతంలో స్నానం చేస్తూ సందడి చేశారు. కాగా, మొదటి సారి ఎత్తైన గుట్టల నడుమ నుంచి భీమునిపాదంగా పిలిచే ప్రదేశం నుంచి జలపాతం జాలువారడంతో పచ్చని అటవీ ప్రాంతం పర్యాటకులను ఆకర్షిస్తోంది.

జలపాతాలకు తరలొస్తున్న పర్యాటకులు



పాలనురగలా దుంకుతున్న చింతోనిగుంపు జలపాతం

బయ్యారం: భారీ వర్షాలకు మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం బయ్యారం పెద్దగుట్టపై ఉన్న పాండవుల జలపాతంతో పాటు చింతోనిగుంపు సమీపంలోని వంకమడుగు జలపాతం చూపరులను కనువిందు చేస్తున్నాయి. జాలువారుతున్న జలపాతం అందాలకు పలువురు ఫిదా అవుతున్నారు. ఈ జలపాతాల అందాలు తిలకించేందుకు పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలొస్తున్నారు.

26 వరకు 'బొగత' సందర్శన నిలిపివేత



వాజేడు: పహారా కాస్తున్న సిబ్బంది

వాజేడు: అటవీ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఈ నెల 26వ తేదీ వరకు బొగత జలపాతం సందర్శన నిలిపివేసినట్లు ములుగు డీఎఫ్ఓ కిషన్ జాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ముత్యంధార, కొంగర, మామిడి లొద్ది, కృష్ణపురం జలపాతాలను పర్యాటకుల భద్రతాకారణాల దృష్ట్యా శాశ్వతంగా మూసివేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో సందర్శకులు ఇటు వైపు వెళ్లొదని సూచించారు. అటవీ అధికారులు హెచ్చరికలు బేఖాతర్ చేసిన వారిపై పోలీసు కేసు నమోదు చేస్తామని తెలిపారు.

సిబ్బంది పహారా.. గేటుకు తాళం

బొగత జలపాతం సందర్శనను నిలిపి వేసిన అధికారులు జాతీయ రహదారి నుంచి జలపాతానికి వెళ్లే దారికి అడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేసి సిబ్బంది కాపలా ఉన్నారు. అదే సమయంలో జలపాతం ప్రధాన ద్వారానికి తాళం వేశారు. కాగా, కొందరు పర్యాటకులు గుమ్మడి దొడ్డి వైపు నుంచి జలపాతం వద్దకు వచ్చి నీటిలో దిగుతున్నారు. వరద ఉధృతంగా ఉందని బొగతకు రావొద్దని అధికారులు హెచ్చరిస్తున్నా కొందరు మాత్రం దొంగ దారిలో జలపాతానికి వెళ్తున్నారు.

వాగు దాటించి.. వైద్యం అందించి

- గర్భిణిని వాగు దాటించి ఆస్పత్రికి తరలించిన వైద్యసిబ్బంది



కృష్ణవేణిని ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

ఎస్ఎస్‌తాడ్వాయి: ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం నర్సాపూర్ వాగు మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ క్రమంలో బుధవారం మండలంలోని అల్లిగూడెం గ్రామానికి చెందిన గర్భిణి గుమ్మడి కృష్ణవేణికి పురిటినొప్పులు రావడంతో ఆశ వర్కర్ కొడిశాల పీహెచ్‌సీ వైద్యాధికారి పవన్‌కు సమాచారం అందించారు. దీంతో పవన్.. హెల్త్ సూపర్‌వైజర్ బాలు, హెల్త్ అసిస్టెంట్ సీతారాంనాయక్‌ను అప్రమత్తం చేశారు. దీంతో వారు వెంటనే గ్రామస్తుల సాయంతో నడుంలోతు వరద నుంచి కృష్ణవేణిని ఎత్తుకుని వాగు దాటించారు. అనంతరం ట్రాక్టర్‌లో పోచాపూర్ వరకు తీసుకొచ్చి అక్కడి నుంచి అంబులెన్స్‌లో ములుగు ప్రభుత్వ సివిల్ ఆస్పత్రికి తరలించినట్లు సిబ్బంది తెలిపారు. కాగా, సకాలంలో అప్రమత్తమై స్పందించి గర్భిణి కృష్ణవేణిని వాగు దాటించిన వైద్యాధికారులు, సిబ్బందిని గ్రామస్తులు అభినందించారు.

రెవెన్యూ వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలి

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: రెవెన్యూ వసూళ్లు, బకాయిలపై నోడల్ జనరల్ మేనేజర్లు ప్రత్యేక దృష్టి సారించాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్లు, చీఫ్ ఇంజనీర్లు, సీజీఎంలు, నోడల్ జీఎంల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిల్లులు చెల్లించని సర్వీసులపై దృష్టి సారించి వాటిని రాబట్టుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. టీసీ ఐపాస్ సర్వీసుల రిలీజ్ వేగవంతం చేయాలన్నారు. కొత్త సబ్ స్టేషన్ పనులను విధిగా తనిఖీలు చేపట్టాలన్నారు. రియల్ టైం ఫీడర్ మానిటరింగ్ పనులు, ఫాల్ట్ ప్యాసేజీ ఇండికేటర్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. భారీవర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడ అంతరాయాలు ఏర్పడినా వెంటనే పునరుద్ధరించేలా మెన్, మెటీరియల్ సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డైరెక్టర్లు వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, వి. మోహన్ రావు, సి.ప్రభాకర్, సీఈలు టి.సదర్ లాల్, బి.అశోక్ కుమార్, కె.తిరుమల్ రావు, రాజు చౌహాన్, అశోక్, రవీంద్రనాథ్, ఆర్.చరణ్ దాస్, మాధవరావు, వెంకటరమణ, జాయింట్ సెక్రటరీ కె.రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నేరస్తుడికి యావజ్జీవ కారాగార శిక్ష

వరంగల్ లీగల్ : బాలిక (8 సంవత్సరాలు)పై లైంగిక దాడికి పాల్పడిన ఘటనలో నేరస్తుడు గీసుకొండ మండలం విశ్వనాథపురం గ్రామానికి చెందిన పసునూరి ఐలయ్యకు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.25 వేల జరిమానా విధిస్తూ వరంగల్ పోక్సో కోర్టు జడ్జి మనీషా శ్రావణ్ ఉన్నవ్ బుధవారం సంచలన తీర్పు వెలువరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.బృందాదేవి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బాలిక 2021, జూన్ 28న సాయంత్రం నీరు తీసుకురావడానికి గ్రామంలోని దుర్గమ్మ గుడి వద్ద గల వాటర్ ప్లాంట్ వద్దకు వెళ్లింది. ఒంటరిగా ఉన్న బాలికను అటుగా వెళ్తున్న అదే గ్రామానికి చెందిన పసునూరి ఐలయ్య తన వెంట చెరువు వద్దకు తీసుకెళ్లాడు. దీనిని గ్రామస్తులతోపాటు బాలిక బంధువు గుగులోత్ రాజు చూసి తల్లికి చెప్పాడు. దీంతో తల్లి వెళ్లి చూడగా గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులతో పాటు తన కూతురు ఉంది. ఏం జరిగిందని అడగగా పసునూరి ఐలయ్య మీ అమ్మాయిని తీసుకుని వస్తుండటాన్ని తాము చూశామని, కాసేపటికి అమ్మాయి కేకలు వినిపించడంతో తాము పరిగెత్తుకుంటూ వచ్చామన్నారు. ఐలయ్య తమను చూసి పారిపోయాడని చెప్పారు. అనంతరం బాధిత బాలిక తన పట్ల ఐలయ్య వ్యవహరించిన తీరును తల్లికి తెలిపింది. దీంతో బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. విచారణలో సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు.. నేరం రుజువుకావడంతో ఐపీసీ సెక్షన్ 376, 366 కింద ఐలయ్యకు పదేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా, బాలికపై లైంగిక దాడి (పోక్సో చట్టం) సెక్షన్ 5, ఆర్/డబ్ల్యూ 6 చట్టం కింద యావజ్జీవ కారాగార శిక్ష (జీవించినంత కాలం), రూ.20 వేల జరిమానా విధిస్తూ జడ్జి మనీషా శ్రావణ్ ఉన్నవ్ తీర్పులో పేర్కొన్నారు. బాధిత బాలికకు పరిహార చెల్లింపు పథకం కింద రూ.7 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ జడ్జి తీర్పులో పేర్కొన్నారు.